క్లుప్తంగా

గ్రామాల్లో దోమల నివారణ స్పెషల్ డ్రైవ్



కొత్తపేట ఎస్సీ హాస్టల్‌లో దోమల మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

కొత్తపేట: గ్రామాల్లో దోమల నివారణకు అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమై దోమల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో గురువారం అవిడి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ బీవీవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ వాడ సద్గుణరావు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, పలు వీధుల్లో అబెట్ మందు స్ప్రేయింగ్ చేయించారు.

కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి



మాట్లాడుతున్న జిల్లా డీసీసీ అధ్యక్షుడు చిట్టిబాబు

మామిడికుదురు: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశగా ముందుకు సాగుతామని అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయడం, పార్టీ శ్రేణుల్లో చైతన్యం తీసుకు రావడం పార్టీ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కొత్తూరి శ్రీనివాస్‌ను చిట్టిబాబు సత్కరించారు. సమావేశంలో పార్టీ నేతలు మహమ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ, నాగవరపు నాగరాజు, నేతల నాగరాజు, కొండేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భేతాళ ఉత్సవానికి సహకరించండి

అంబాజీపేట: శ్రీ విజయ భేతాళ స్వామి ఉత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయబద్ధంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ ఆర్.భీమరాజు కోరారు. శుక్రవారం జరిగే బేతాళ ఉత్సవానికి సంబంధించి భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, సాయుధ బలగాలు, హోమ్ గార్డులు, మొబైల్ పార్టీలు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. ప్రతీ వాహనం వద్ద ఎస్సై కె.చిరంజీవి పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అమలాపురం నుంచి వచ్చే వాహనాలను గంగలకుర్రు మలుపు నుంచి పుల్లేటికుర్రుకు, పి.గన్నవరం నుంచి వచ్చేవి మాచవరం నుంచి అవిడి రేవునకు మళ్లించినట్లు చెప్పారు. తిరిగి అదే దారిలో వాహనాలు వస్తాయన్నారు. భారీ వాహనాలు అమలాపురం, ఈదరపల్లి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్సై కోరారు.

బోధనా ప్రమాణాలు పాటించాలి

సఖినేటిపల్లి: మండల పరిధిలోని రామేశ్వరం హైస్కూల్ ప్లస్ (కాలేజీ)ను గురువారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించారు. ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలను బోధనా సిబ్బందితో ఆయన చర్చించారు. వెంట మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎంఈవో డీ కిషోర్ కుమార్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జీ పెదకాపు, నాయకులు గుబ్బల ఫణి, ముప్పర్తి నాని, గెద్దం మహాలక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు. 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పలు రోడ్లుకు శంకుస్థాపనలు చేశారు. సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి, శృంగవరప్పాడు గ్రామాలలో ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.

గ్రామాభివృద్ధే 'పల్లె పండుగ' ధ్యేయం

ఆలమూరు: గ్రామాలన్నింటినీ అభివృద్ధి పథంలో నడిపించాలనే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహిస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, బడుగువానిలంక, చెముడులంక, మడికి గ్రామాల్లో గురువారం ప్రారంభమైన పల్లె పండుగ- పంచాయితీ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మూలస్థాన అగ్రహారంలో రూ.37 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేసారు. బడుగువానిలంకలో ఏటిగట్టు వద్ద రూ.30 లక్షలు, మడికి శివారు చిలకలపాడులో రూ.20లక్షలు, చెముడులంక శివారు గాంధీనగర్‌లో రూ.20 లక్షలు, చొప్పెల్లలో రూ.30 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బండారు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

తూర్పుపాలెం వంతెనకు దారేదీ..?



నిరుపయోగంగా మారిన తూర్పుపాలెం వంతెన



స్థల వివాదంతో ఆగిన అప్రోచ్ నిర్మాణం

- అప్రోచ్ రోడ్డుకు మార్గం లేకపోయినా వంతెన నిర్మాణం
- రూ.4 కోట్లతో నిర్మాణం పూర్తి
- ఏడేళ్లుగా నిరుపయోగం

మలికిపురం: శంకరగుప్తం మేజరు డ్రైన్‌పై తూర్పుపాలెం- పల్లిపాలెం గ్రామాల మధ్య నెలకొన్న దీర్ఘకాలిక సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ఇక్కడ గతంలో ఉన్న వంతెన కూలిపోవడంతో గత 20 ఏళ్లుగా ఇక్కడి ప్రజలు అనేక విజ్ఞప్తులు, పోరాటాలు చేయగా టీడీపీ ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరయ్యాయి. అట్టహాసంగా శంకుస్థాపన చేసి గత ప్రభుత్వ పెద్దలు పనులు ప్రారంభించారు. అయితే వంతెన నిర్మాణం సమయంలోనే అప్రోచ్ రోడ్డుకు దారి సమస్య తలెత్తింది. మండలంలోని తూర్పుపాలెం- గూడపల్లి పల్లిపాలెం గ్రామాల మధ్య నిర్మితమవుతున్న ఈ వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు వేసేందుకు దారి లేదు. అప్రోచ్‌తో పాటు వంతెన నిర్మాణం జరిగిన భూమి విషయంలోనే ఒకే కుటుంబ సభ్యుల మధ్య (జనసేన- టీడీపీ నేతలు) మధ్య వివాదం తలెత్తి వంతెనకు శాపంగా మారింది. ఈ వివాదం పరిష్కారానికి పలువురు ప్రయత్నించినా కొలిక్కి రాలేదు. ఫలితంగా వంతెన నిర్మాణం పూర్తి అయినా నేటికీ వినియోగం లోనికి రాలేదు.

శిలాఫలకంపై స్థలదాత పేరు మరిచారు..

సుమారు రూ.4 కోట్లతో వంతెన నిర్మాణం జరిగింది. డ్రైనేజీ శాఖతో పాటు టూరిజం శాఖ ద్వారా ప్రభుత్వం రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. ఈ వంతెన నిర్మాణ స్థలం సుమారు 4 ఎకరాలు ఉంటుంది. ఈ భూమి అంతా అడబాల కుటుంబీకులదే. ఈ స్థలాన్ని తూర్పుపాలెం గ్రామానికి చెందిన అడబాల షాహుకారు నరసింహస్వామి పేరున ఆయన కుటుంబ సభ్యులు వంతెన నిర్మాణానికి ఇవ్వడానికి అంగీకరించారు. దీంతో వంతెన నిర్మాణాన్ని అధికారులు ప్రారంభించారు. అయితే వంతెనకు అడబాల షాహుకారు నరసింహస్వామి వారధిగా పేరు పెట్టాలని ఆయన కుటుంబ సభ్యులు కోరడంతో అప్పటి టీడీపీ పెద్దలు కూడా అంగీకరించారు. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్రోచ్ లేని వంతెనను హడావిడిగా అప్పటి తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రారంభించేశారు. ప్రారంభ శిలాఫలకంపై స్థల దాత పేరు ప్రస్తావించలేదు. దీంతో స్థల దాతలకు ఆగ్రహం వచ్చింది. వంతెన అప్రోచ్ స్థలాన్ని వెనక్కు తీసుకున్నారు.

అధికారులకు ఎందుకంత ఉదాసీనత?

తూర్పుపాలెం వంతెన నిర్మాణంపై అధికారులు ఇంత ఉదాసీనంగా ఎందుకు వ్యవహరించారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎటువంటి నిర్మాణమయినా నిర్మాణం చేపట్టే స్థలాన్ని సేకరించి, ఆ శాఖకు నిబంధనల మేరకు బదలాయించుకుని పనులు ప్రారంభించాలి. కాని ఇక్కడ డ్రైనేజీ శాఖ ఇంజినీర్లు అటువంటి బదలాయింపులు లేకుండా నిర్మాణం ప్రారంభించేశారు. ఇన్ని కోట్ల ప్రభుత్వ నిధులు ఖర్చు చేసినా తీరా స్థల యజమానులు వ్యతిరేకించడంతో వంతెన నిర్మాణం ఆగిపోయింది. అప్రోచ్ లేక కోట్ల రూపాయలతో కట్టిన వంతెన నిరుపయోగంగా ఉంది. దీనికి భాధ్యులు ఎవరనేది జవాబు లేని ప్రశ్నగా మిగిలిపోయింది.

అధికారుల తీరుపై ప్రజాగ్రహం

వంతెన నిర్మించినా నిరుపయోగంగా మారిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించి వంతెనను వినియోగంలోనికి తేవాలని కోరుతున్నారు. వంతెనపై నుంచి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

ఆగిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఇక్కడ వంతెన సమస్య నేపథ్యంలో ఈ గ్రామం మీదుగా వెళ్ళనున్న మరొక ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం కూడా ఆగి పోయింది. ఈ వంతెనకు అనుసంధానంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ. 5 కోట్ల నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ వంతెన సమస్య పరిష్కారం అయితే ఆ రోడ్డు కూడా అభివృద్ధి అవుతుంది.

పరిష్కారానికి కృషి



తూర్పుపాలెం వంతెన అప్రోచ్ స్థల వివాదంపై చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే స్థానిక పెద్దలతో సంప్రదింపులు చేశాం. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం. వంతెనను వినియోగంలోకి తెస్తాం.

బి.రేష్మా రాణి, ఏఈ, డ్రైనేజీ, మలికిపురం.

నేత్రానందంగా దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం



పెదపట్నంలంక ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మ 33వ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవోపేతంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. సుమారు 108 మంది మహిళలు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పెదపట్నం గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ గంటి శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఆలయం వద్ద గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ పూజ, నవగ్రహారాధన, నక్షత్ర ఆరాధన తదితర పూజలను నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. అక్కడ గోదావరి నదీ తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వైనతేయ గోదావరి నదిలో చక్రస్నానం చేయించారు. అనంతరం గోదావరి నది నుంచి ముత్తయిదువులు అమ్మవారి ఆలయానికి ఘటాలతో నదీ జలాలు తీసుకువచ్చారు. ఈ నదీ జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం తదుపరి కనకదుర్గమ్మకు లక్ష కుంకుమార్చన, లలితా హోమం వైభవంగా చేపట్టారు. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.

వాల్మీకి రామాయణం గొప్ప ఇతిహాసం



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మహిమాన్విత ఇతిహాసమైన రామాయణాన్ని వ్యక్తిత్వపరంగా రాముడి సుగుణాలను, సీతమ్మ గొప్పతనాన్ని గ్రంథస్థం చేసి మానవళికి అందించిన మహనీయుడు మహర్షి వాల్మీకి అని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ యుగాలు, కాల ధర్మాలు మారుతున్నప్పటికీ నేటికీ వాల్మీకి రామాయణం ధర్మ పారాయణులకు దారి చూపుతూనే ఉందన్నారు. సీతా రాముల చరిత్ర కావ్యంగా ఆవిర్భవించిందే వాల్మీకి రామాయణమని పేర్కొన్నారు. మానవుడి ధార్మిక జీవన విధానం ఎలా ఉండాలో తెల్పి చెప్పిన మహాకవి వాల్మీకి మహర్షి అని కొనియాడారు. కార్యక్రమంలో సూదాబత్తుల రాము, మైలా ఆనందరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: రామాయణ మహాకావ్యం రచయిత వాల్మీకి మహర్షి జయంతిని గురువారం మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. రామాయణం గ్రంథంలో వాల్మీకి మహర్షి శ్రీరాముని జీవిత చరిత్రను అద్భుతంగా వివరించారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యాలి శ్రీనివాస్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భారత సాహిత్యంలో ఆదికవి వాల్మీకి

కొత్తపేట: రామాయణ మహా కావ్యాన్ని రచించిన వాల్మీకి భారత సాహిత్యంలో ఆదికవి అని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు కొనియాడారు. వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ కే సత్యనారాయణ, డాక్టర్ కే అంకమరావు, కేఎస్ఎస్ ప్రసాద్, సీహెచ్ భవాని పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో రహదారి నిర్మాణాలు

ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



మొగలికుదురులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మామిడికుదురు: ఉపాధి హామీ నిధులు రూ.2 కోట్ల వ్యయంతో 11 గ్రామాల్లో పలు సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని మొగలికుదురు, నగరం, పెదపట్నం, మాకనపాలెం, ఆదుర్రు, లూటుకుర్రు, పాశర్లపూడిలంక, పాశర్లపూడి, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో ఉపాధి నిధులతో నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్లకు గురువారం ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడారు. కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఏపీఓ రమేష్‌బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు

కొత్తపేట: గ్రామ స్థాయిలో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ పర్యవేక్షణలో ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి పాల్గొన్నారు. మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ఎంపీపీ మార్గన సమీక్ష జరిపారు. రాజ్యాంగంలో మొదటి పేజీలో పీఠిక (ప్రవేశిక)ను కూడా చదివే కార్యక్రమాన్ని వచ్చే రాజ్యాంగ దినోత్సవం అయిన నవంబరు 26 లోపు శ్రీకారం చుట్టాలని ఎంపీడీఓ నరేష్‌కుమార్ ప్రతిపాదించగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన

మామిడికుదురు: మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ పాశర్లపూడి పంచాయతీ పరిధిలోని ఆరో వార్డుకు చెందిన కొందరు గురువారం రాత్రి ధర్నా చేశారు. నివాస ప్రాంతాల మధ్య బ్రాందీ షాపు ఏర్పాటు చేయడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని వెంటనే వేరొక చోటుకు మార్చాలన్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గతంలో ఇక్కడే ప్రభుత్వ మద్యం షాపు ఉండేదని, దాని వల్ల అప్పట్లో తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. దీని నుంచి తమకు విముక్తి కల్పించాలని కోరారు.

సంప్రదాయ వంటకాలపై అవగాహన



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

రాజోలు: ప్రపంచ ఆహార దినోత్సవం పురస్కరించుకొని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదాయ ఆరోగ్య వంటకాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్, బోటనీ, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల సంప్రదాయ వంటకాలను తయారు చేసి కళాశాలకు ప్రదర్శన నిమిత్తం తీసుకొని వచ్చారు. వంటకాలను విక్రయించడం ద్వారా రూ.3,500లు వచ్చాయని వాటిని నిరుపేద విద్యార్థుల ఫీజు కట్టేందుకు వినియోగిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, నల్లి రాజు, డాక్టర్ సీఎస్ఎస్, డాక్టర్ బోస్, సరిత, పి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

భేతాళ మహోత్సవం.. చూచిన కనులదే భాగ్యం



శ్రీనివాస నగర్‌లో కొలువైన విజయ భేతాళ స్వామి

- నేడు భేతాళ వాహనాల మహోత్సవం
- 13 వాహనాలతో భక్తులకు కనువిందు
- 58 ఏళ్లుగా కొనసాగుతున్న ఉత్సవం

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా జరిపే విజయ భేతాళ స్వామి వాహన మహోత్సావాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. రంగూన్, మయన్మార్ (బర్మా) ప్రాంతాల్లో భేతాళ ఉత్సవాలు జరుగుతాయి. పూర్వకాలంలో అంబాజీపేట, పేరూరులకు చెందిన కొంత మంది కూలి పనుల నిమిత్తం రంగూన్ తదితర ప్రాంతాలకు వెళ్లినప్పుడు భేతాళ ఉత్సవాలను నిర్వహించడం గమనించారు. భేతాళ ఉత్సవం నిర్వహించడం, పూజించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్నట్లు గమనించారు. విదేశాలకు వలస వెళ్లిన వారు తిరిగి స్వదేశానికి వచ్చిన తరువాత వారు కూడా స్థానికంగా భేతాళ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.



మాచవరంలో హంసను ఉత్సవానికి సిద్ధం చేస్తున్న యువకులు

నాలుగు దశాబ్దాలుగా కొనసాగింపు

1967లో శెట్టిబలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన భేతాళ ఉత్సవాలు నాలుగు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. 1981లో అంబాజీపేట పెద్దవీధి శివారు శ్రీనివాసనగర్‌లో విజయ భేతాళ స్వామి ఆలయాన్ని నిర్మించి దొమ్మేటి శ్రీరాములు, పితాని నాగిశెట్టి, శీలం వెంకట్రావుల ఆధ్వర్యంలో విస్తరించారు. ఈ ఉత్సవానికి 13 ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలు అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో కొలువు దీరడం, పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడం, చేడీ తాళింఖానాలు ప్రత్యేక శోభను తెస్తాయి. 13 ప్రాంతాల నుంచి విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనాలపై తమకు ప్రీతి పాత్రమైన దైవ రూపాలను అలంకరించి మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగించుకుంటూ అంబాజీపేట సెంటర్‌కు చేరుకుంటారు. పెద్దవీధి, బస్టాండ్ రోడ్డు, గన్నవరం రోడ్లలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆద్యంతం భేతాళ స్వామి వాహనాల మహోత్సవం కనువిందు చేయనుంది.

కొలువుతీరే వాహనాలివే

శ్రీనివాస్‌నగర్ నుంచి గరుక్మంతుడు, పెచ్చెట్టివారి పాలెం నుంచి గరుక్మంతుడు, మాచవరం శ్రీరామ్ నగర్ నుంచి సింహం వాహనం, దొమ్మేటివారి పాలెం నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారిపాలెం నుంచి శ్రీ ఆంజనేయస్వామి, పోతాయిలంక నుంచి శ్రీ ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి శ్రీ విజయ గణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి నుంచి హంస వాహనం, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారి పాలెం నుంచి శ్రీషిరిడీ సాయిబాబా, గుత్తులవారి పాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి శ్రీరాజ రాజేశ్వరీదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అంబాజీపేట: మండల పరిధిలోని ముక్కామల సబ్ స్టేషన్ పరిధిలోని మోడేకుర్రు ఫీడర్ పరిధిలో గల గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. కముజువారిలంక, శ్రీరాంపురం, చినలంక, చిరతపూడి, కొత్తపేట మండలంలోని గొలకోటి వారిపాలెం, మోడేకుర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మామిడికుదురు: నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తాటిపాక సెంటర్, మొగలికుదురు, గెద్దాడ, వేగివారిపాలెం, కడలి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. 33 కేవీలైన్‌లో ట్రీ కటింగ్‌లో భాగంగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అయినవిల్లి: ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ ప్రభుత్వ కళాశాలలో రసాయన శాస్త్రం బోధించడానికి అర్హులైన అతిథి అధ్యాపక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు నందు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. వీరికి గంటకు రూ.150లు చొప్పున గరిష్టంగా రూ.10 వేలు గౌరవ వేతనంగా చెల్లించనున్నట్లు తెలిపారు. అసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను ఈ నెల 19లోపు అందజేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ అభ్యర్థుల బోధనా పటిమ ఆధారంగా జరుగుతుందన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పి.గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన గరిమెళ్ల గోపాల కృష్ణ గురువారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. నగదును ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

గంటికి సతీ వియోగం



బాలా త్రిపుర సుందరి (ఫైల్)

అంబాజీపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి గంటి శ్రీరామమూర్తికి సతీ వియోగం కలిగింది. ఆయన సతీమణి బాలా త్రిపుర సుందరి (68) బుధవారం చెన్నైలో కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధ పడుతూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన అంబాజీపేటకు తరలించారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. శ్రీరామమూర్తికి సతీ వియోగం కలగటం పట్ల అంబాజీపేట గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘంతో పాటు పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

సాయిబాబా మృతి తీరని లోటు

మలికిపురం: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అన్నారు. గురువారం మలికిపురం పూలే, అంబేడ్కర్ భవనంలో చైతన్య సమితి ప్రధాన కార్యదర్శి మందా సత్యనారాయణ అధ్యక్షతన సాయిబాబా సంతాప సభ జరిగింది. సాయిబాబా చిత్రపటానికి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద రాజేష్ మాట్లాడుతూ ప్రజలలో చైతన్యం నింపే సాయిబాబా వంటి ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన సమాజ్ పార్టీ నాయకుడు బత్తుల లక్ష్మణ్‌రావు, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ఇక్బాల్, ముత్యాల శ్రీనివాసరావు, పౌరహక్కుల వేదిక జిల్లా కన్వీనర్ జిల్లెళ్ల మనోహరం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ

పి.గన్నవరం: పీఎం శ్రీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గురువారం అమలాపురంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా విద్యా వైభవ్ క్విజ్‌లో పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయిలో 26 పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు నాలుగు విభాగాల్లో అమలాపురంలో పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. తమ పాఠశాల నుంచి శృంగవరపు బిందు, ఎల్.అజేయుడు క్విజ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్టు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారని చెప్పారు. విద్యార్థులను హెచ్ఎం ప్రసాద్‌తో పాటు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.